www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 నవంబర్ 2025
5
తిరుపతి



శ్రీ చైతన్య స్కూల్లో నాసా ప్రభంజనం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి బైరాగిపట్టెడ లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ జెబిఎల్ బ్రాంచ్ లో రాష్ట్రస్థాయి డ్రాయింగ్ కాంపిటీషన్ లో మొదటి స్థానం రావడంతో ఎంతో గర్వకారణంగా ఉందని ప్రిన్సిపల్ ధనలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజిఎం సురేష్ రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం వచ్చినటువంటి తొమ్మిదవ తరగతి విద్యార్థిని జి.జోషితను మొమెంటో, మెడల్‌తో సత్కరించి అభినందించారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని తెలిపారు. విద్యార్థి దశ నుంచి శాస్త్ర సాంకేతిక విద్యపై ఆసక్తి పెంచుకొని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా ఎంపికైన 27 మంది విద్యార్థులకు నాసా కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధనలక్ష్మి, ఏవో రవి బాబు, డీన్ సురేష్ పాల్గొన్నారు.

నా దారి రహదారి..!

చిమ్మచీకట్లోనే వెళ్లాలి మరి..!!

బ్రహ్మోత్సవాలకైనా వెలుగొచ్చేనా..? నాలుగు లైన్ల రోడ్డులో వీధిలైట్లేవి టిటిడికి రూ.70వేలు కరువా..!



తిరుచానూరుకు వెళ్లే నాలుగు లైన్ల రహదారి .. ఏడాదిగా చిమ్మచీకట్లోనే..

మంగళం నుంచి మంగాపురానికి కలిపేందుకు మాస్టర్ ప్లాన్లో భాగంగా నాలుగు లైన్ల రహదారి వేశారు. ఇరుకు దారులను విస్తరించారు. రాళ్లతో నిండిన మార్గాన్ని రాజమార్గం చేశారు. కాని లైట్లు ఏర్పాటు చేయడంలో మాత్రం నిర్లక్ష్యం చూపారు. వెరసి ఆ మార్గంలో సాయంత్రం అయితే ప్రయాణించాలంటే వాహనదారులు, పాదచారులు భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. తరచూ ప్రమాదాల బారిన పడుతూ జీవితాలను పణంగా పెడుతున్నారు. కోట్లు వెచ్చించిన టిటిడికి 70వేలు నిధులు లేకపోవడం విడ్డూరం. నాలుగు రోజుల్లో జరిగే అమ్మవారి బ్రహ్మోత్సవాలకైనా ఆ దారిలో వెలుగునిచ్చేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే. అమ్మవారి భక్తులకు ఏడాదిగా ఇదే దుస్థితి.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుమల శ్రీవారి ఆలయం తర్వాత అంతటి ప్రాముఖ్యత పొందినది అలిమేలుమంగాపురం (తిరుచానూరు). వెంకటేశ్వరస్వామి సతీమణి పద్మావతి దేవి కొలువైన ప్రాంతం కావడంతో వేలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. తిరుచానూరుకి రేణిగుంట, మంగళం, సిఆర్ఎస్. తిరుచానూరు రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించాలంటే ప్రధాన రహదారి, నారాయణాద్రి ఆసుపత్రి నుంచి చైతన్యపురం మీదగా తిరుచానూరుకు వెళ్లే మార్గం కీలకమైనది. జిల్లా కలెక్టరేట్‌కు, ఆటోనగర్, మంగళం, శెట్టిపల్లి, జీవకోన, తిమ్మనాయుడుపాళెం, రేణిగుంట, తదితర ప్రాంతాల వారికి ఈ రోడ్డులో ప్రయాణం దగ్గర. గతంలో గుంతలమయంగా ... రాళ్లు తేలి... ఇరుకు ఇరుకుగా సింగిల్ మెటల్‌రోడ్డుగా ఉండేది. ఈ మార్గంలో ప్రయాణీకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉండేది. ఏళ్ల తరబడి సమస్య పరిష్కారం కాక ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎట్టకేలకు టిటిడి సహకారంతో మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా తిరుచానూరు 150 బైపాస్ రోడ్డు నుంచి, ఉప్పరపల్లి నారాయణాద్రి ఆసుపత్రి వరకు నూతన రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. 2.25 కిలోమీటర్ల మేరకు 150 అడుగుల వెడల్పుతో రూ.13.29 కోట్ల రూపాయలు వ్యయంతో డివైడర్తో కూడిన 4 లైన్ల రోడ్డును నిర్మించారు. రోడ్డు మధ్యన డివైడర్ కరెంటు స్థంబాలు, ఏర్పాటుచేసి, ఆదునిక లైట్లు ఏర్పాటు కూడా ఏర్పాటు చేశారు. కానీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో సాయంత్రం ఆరు గంటలు అయితే ఈ మార్గం మొత్తం చిమ్మచీకటిగా ఉండడంతో, ఆఖరికి డివైడర్ సైతం అగుపించక అనేక మంది వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు ప్రారంభమై ఏడాదిన్నరవుతున్నా ఇప్పటికి లైట్లు వెలిగితే ఒట్టు. తిరుచానూరు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయి, కనీసం తాత్కాలిక లైటింగ్సు కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. చీకటి రోడ్డులోనే వాహనదారులు ప్రయాణం చేస్తున్నారు. ఈ రోడ్డుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తే చాలు లైట్లు వెలుగుతాయి. దానికి కోట్లు, లక్షలు రూపాయలు అవసరముకుంటే పప్పులో కాలేసినట్టే. భారీ లైట్లు సామర్థ్యానికి తగ్గట్టు రెండు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేస్తే చాలు. ఒక్కో విద్యుత్ మీటర్కు 35 వేలు చొప్పున, రెండింటి కలిపి రూ.70 వేలు ఏపిఎస్ పీడీసీఎల్ కు చెల్లిస్తే గంటల వ్యవధిలో వారు కనెక్షన్ ఇస్తారు. నిత్యం కేవలం హుండీ ద్వారానే కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్న టిటిడికి 70 వేల రూపాయలు లేదనేలా వ్యవహరించడం దారుణం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, విద్యుత్ మీటర్లకు 70వేల రూపాయలు చెల్లించి ఆ మార్గంలో వెలుగులు తీసుకురావాలని, మరో నాలుగు రోజుల్లో ప్రారంభం కానున్న అమ్మవారి బ్రహ్మోత్సవాలకైన విద్యుత్ వెలుగు నిస్తారని ఆశిద్దాం..!

'ప్రధాన'ంగా అందరూ అగ్రవర్ణాలే...

నామినేటెడ్ పదవుల్లో చోటేది...

చంద్రబాబుపై దళితుల అసంతృప్తి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఉమ్మడి జిల్లాలో టిడిపికి చెందిన దళిత నాయకులు చంద్రబాబుపై అసంతృప్తి వెళ్లగక్కుతున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పెత్తందారులకే పదవులు పట్టం గడుతున్నారని కినుక వహిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఇప్పటివరకూ తుడ, తిరుపతి గంగమ్మ, బోయకొండ, శ్రీకాళహస్తి, కాణిపాకం పాలకమండళ్లులోనూ 'రెడ్డి', 'నాయుడు', 'బలిజ' సామాజికవర్గాలకే పెద్దపీట వేశారన్నది వారి ఆవేదన. ముఖ్యంగా చిత్తూరు డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ఇతర పార్టీ నుంచి వలసొచ్చిన అమాస రాజశేఖర్‌రెడ్డికి పట్టం కట్టారు. రాష్ట్రవ్యాప్తంగా పది కార్పొరేషన్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన 122 డైరెక్టర్ పదవుల్లోనూ ఒక్క దళితుడు కూడా లేకపోవడం బాధాకరమని చర్చించుకోవడం గమనార్హం. అంబేద్కర్ రిజర్వేషన్ తీసుకురావడం వల్ల ఓటేయడానికి తప్ప ఒరిగిందేమీ లేదన్నది వారి ఆవేదన. రిజర్వేషన్ పుణ్యమా అని గూడూరు, సత్యవేడు, సూళ్లూరుపేట, జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో దళితులకు ఇచ్చారే తప్ప ప్రత్యేకించి పెద్దపీట వేసిన దాఖలా లేదు. టిడిపి ఏర్పడినప్పటి నుంచి నేటివరకూ ఒక్క దళితుడు కూడా జిల్లా పార్టీ అధ్యక్షులుగా లేరని నియోజకవర్గానికి చెందిన ఓ ప్రముఖ నాయకుడు 'ప్రజాశక్తి'తో కామెంట్ చేయడం గమనార్హం. ఒకటీ అర 'బీసీ'లకు కేటాయించినా, దళితులకు ఒక్క పదవి కూడా ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తోంది.

తుడా ఛైర్మన్‌గా డాలర్స్ దివాకర్‌రెడ్డి, డిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్‌రెడ్డి, చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌గా కఠారి హేమలత, కాణిపాకం ట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా మణినాయుడు, శ్రీకాళహస్తి బోర్డు ఛైర్మన్‌గా కొట్టే సాయి, టిటిడి బోర్డు సభ్యునిగా భానుప్రకాష్‌రెడ్డి, వైద్యం శాంతారాం, బోయకొండ గంగమ్మ ఛైర్మన్‌గా పత్తిరాజు, గంగమ్మ గుడి ఛైర్మన్‌గా మహేష్‌యాదవ్ ఉన్నారు. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నరసింహయాదవ్, వన్నెకుల క్షత్రియ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర ఛైర్మన్ సిఆర్ రాజన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ రాష్ట్ర ఛైర్మన్‌గా ఎం.సుగుణమ్మ, హస్తకళల గ్రామీణాభివృద్ధి రాష్ట్ర ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, రెస్కో ఛైర్మన్‌గా ప్రతాప్, కుప్పం తిరుపతి గంగమ్మ గుడి ఛైర్మన్‌గా విఎన్‌కె రవిచంద్రబాబు, కుప్పం మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా మునిరాజులను ప్రకటించారు. నామినెటెడ్ పదవుల్లో దళితులకు చోటు దక్కకపోవడం ఆ సామాజికవర్గంలో ఆగ్రహాన్నే కలిగిస్తోంది.

పసిపిల్లల గుండెజబ్బులపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

భారతదేశంలో ప్రతి 1000 మంది చిన్నారులలో ఎనిమిది మందికి పుట్టుకతో గుండె జబ్బులు వచ్చే అవకాశాలు వుంటాయని, అందులో 90శాతం మందికి ఆపరేషన్లు చేయాల్సిన అవసరం రావచ్చునని, కావున ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకుని చిన్నపిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్విమ్స్ సంచాలకులు ఆర్.వి.కుమార్ అన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకుని స్విమ్స్ సిటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో 'పదిలం పదిలం పసిహృదయం'అంటూ చిన్నపిల్ల గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. రెండురోజుల పోస్టర్ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమయ్యింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ ప్రదర్శన ఉంటుందని, ఆస్పత్రికి వచ్చే రోగులు, వైద్య విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించి అవగాహన పెంచుకోవాలన్నారు. ఎస్.వి. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.వి.ఎస్.సత్యనారాయణ చేతుల మీదుగా 'పదిలం పదిలం పసి హదయం' అనే పుస్తకాలు వైద్య విద్యార్థులకు పంపిణీ చేశారు. డీన్ అలోక్‌సచన్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

చక్కెర వ్యాధికి భయపడొద్దు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

మధుమేహ వ్యాధి (చక్కెర వ్యాధి)కి భయపడాల్సిన అవసరం లేదని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వి కుమార్ అన్నారు. పద్మావతి ఆడిటోరియంలో మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్‌సచిన్ ఆధ్వర్యంలో జరిగింది. ఎండోక్రనాలజీ విభాగం ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వనజాక్షమ్మ, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

మెగా ఉచిత మధుమేహ పరీక్ష


ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రపంచ మధుమేహ దినోత్సవం పురస్కరించుకుని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి, వినాయకసాగర్ వాకర్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీశ్రీనివాస సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత మధుమేహ పరీక్షా శిబిరాన్ని వినాయకసాగర్ పార్కులో శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 250 మంది లబ్దిదారులు పాల్గొని మధుమేహానికి సంబంధించిన ముఖ్యమై పరీక్షలు, వైద్య సంప్రదింపులు పొందారు. డాక్టర్ లిఖితరెడ్డి మాట్లాడుతూ మధుమేహాన్ని కేవలం నియంత్రించడం మాత్రమే కాకుండా, నిపుణులైన ఎండోక్రైనాలజిస్ట్ పర్యవేక్షణలో సరైన ఆహారం, జీవనశైలిలో మార్పులు, క్రమం తప్పని మానిటరింగ్‌తో రివర్స్ చేయవచ్చన్నారు. డాక్టర్ శ్రీధర్‌ముని, వాకర్స్ ఇంటర్నేషనల్ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, వినాయకసాగర్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, కార్యదర్శి చంద్ర పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలోని ధర్మగిరిలో ఉన్న వేద విజ్ఞానం పీఠంలో వేద విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి శుక్రవారం వస్త్రాలను పంపిణీ చేశారు. సంవత్సరానికోసారి వేద పాఠశాలలోని విద్యార్థులకు టీటీడీ వస్త్రాలు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా 4 పంచెలు, ఒక దుప్పటి చొప్పున 380 మంది విద్యార్థులకు అదనపు ఈవో పంపిణీ చేశారు. శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్య అవధాని, పాల్గొన్నారు.





అభినందనలు తెలియజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్

జీఎస్టీ డీసీటివోల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వాణిజ్య పన్నుల శాఖ (జి.ఎస్.టి) డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లుగా గునిశెట్టి మురళీకష్ణ, శ్రీలక్ష్మీదేవి లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రేణిగుంట, తిరుపతి, శ్రీకాళహస్తికి చెందిన డిస్ట్రిక్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు వీరిని ఘనంగా సత్కరించారు. రేణిగుంటకు చెందిన మురళీకష్ణ తొలి ప్రయత్నంలోనే గ్రూప్ 2లో అర్హత సాధించి, వాణిజ్య పనుల శాఖలో ఏసిటీవోగా ఉద్యోగం సాధించి వాణిజ్య పన్నుల శాఖలో కర్నూలు, అనంతపురం ప్రాంతాలలో పనిచేశారు. అక్కడినుంచి పదోన్నతి పొంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గా శ్రీకాళహస్తి సర్కిల్ లో బాధ్యతలు చేపట్టారు. శ్రీకాళహస్తి డివిజన్ వాణిజ్య పన్నుల నూతన కార్యాలయం ఏర్పాటైన సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కెవి చౌదరి ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా కెవి చౌదరి మాట్లాడుతూ శ్రీకాళహస్తి డివిజన్‌లో వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం ఏర్పాటు చేయడం వ్యాపారులకు ఉపయోగపడుతుందన్నారు. శ్రీకాళహస్తి డివిజన్‌లో వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ రఘురామిరెడ్డి , తిరుపతి టింబర్ డిపో అసోసియేషన్ అధ్యక్షులు జే.వి.కష్ణయ్య , తిరుపతి స్టీల్ అండ్ సిమెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు హేమచంద్ర రెడ్డి , తిరుపతి జిల్లా ఎఫ్ఎంసీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేంద్రబాబు , సెక్రటరీ మధుసూదన్ రావు , శ్రీకాళహస్తి క్లాత్ మర్చంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వరూప్, శ్రీకాళహస్తి మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మధు , రేణిగుంట ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాజేంద్రన్ , పాండ్యన్, శ్రీకాళహస్తి ఎఫ్ఎంసీజీ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ కార్యవర్గము పాల్గొంది.



ఆక్రమణదారులను అడ్డుకుంటున్న మఠం అధికారులు

30 కోట్ల విలువైన భూమిలో ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన 30 కోట్ల విలువైన భూమిలో శుక్రవారం మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి ఆదేశాలతో ఏఈవో కష్ణారెడ్డి, మఠం సూపరింటెండెంట్ కేశవులు ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకొన్నారు. తిరుపతి గ్రామీణ మండలం సర్వేనెంబర్ 17/3లో ఉన్న 2.20 ఎకరాల భూమిలో కొంతమంది అనధికారికంగా డాక్యుమెంట్ల ద్వారా మఠం భూమిని అమ్మకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో ఆక్రమణ జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి వారు చేస్తున్న అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేశామన్నారు. ప్రభుత్వం ఈ సదరు భూమిలో రిజిస్ట్రేషన్ లపై నిషేధం విధించిందని మఠం అధికారులు స్పష్టం చేశారు. ఇకపై ఎవరైనా మఠం భూమిని ఆక్రమించాలని ప్రయత్నం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసేలా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరికలు చేశారు. మఠం సిబ్బంది సీతారామయ్య, రమేష్, మధు, కిరణ్, విజయ్ నాయక్, వెంకటేష్, గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

మ్యాపింగ్ ఆఫ్ ప్రోజెని వేగవంతం చేయండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్), 2002–2025 ఓటర్ల జాబితాలో నమోదై ఉన్న ఓటరుకు వారి సంతాన ఓటర్లను అనుసంధానం చేసే ప్రక్రియ (మ్యాపింగ్ ఆఫ్ ప్రోజె)ను వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం సిఇఒ కార్యాలయం విజయవాడ నుంచి జిల్లాలోని ఇఆర్ఒ, ఎఇఆర్ఒ, సూపర్‌వైజర్, బిఎల్‌ఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి నుంచి ఇఆర్ఒ ఎన్.మౌర్య సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ప్రస్తుత ఓటర్ల జాబితాలో గుర్తించిన ఓటర్లకు వారి వారసులు (కుమారుడు, కుమార్తె, మనవడు, మనవరాలు) మ్యాపింగ్ చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. తక్కువ పురోగతిలో ఉన్న బిఎల్‌ఒలు రాబోయే నాలుగు రోజుల్లో ఇంటింటా తిరిగి ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ అమరయ్య, తిరుపతి అర్బన్ తహాశీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ డిటి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

ఫార్మసీలో వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి – రేణిగుంట మార్గంలోని కృష్ణతేజ ఫార్మసీ కళాశాలలో బి.ఫార్మ్, ఫార్మ్.డి ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల ట్రస్ట్ మెంబర్ వరుణ్ సాయి, కళాశాల డైరెక్టర్ భాస్కర్ పటేల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వరుణ్ సాయి మాట్లాడుతూ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫార్మసీ రంగంలో విద్యార్థులు వృత్తి నైపుణ్యంతో పాటు క్రమశిక్షణ మానవతా విలువలతో ముందుకెళ్లాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ జయశంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దష్టిలో ఉంచుకొని ఆధునిక ప్రయోగశాలల సదుపాయాలు, పరిశోధన అవకాశాలను విద్యార్థి వ్యక్తిత్వ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో వేణు, బాధితులు

వెస్ట్ పోలీసులపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం బిటిఆర్ కాలనీలో కాపురం ఉండే ఆటో డ్రైవర్ మధు తన తల్లికి స్విమ్స్ లో డయాలసిస్ చేసుకుంటున్న క్రమంలో డబ్బులు తక్కువగా ఉండడంతో స్నేహితులకు ఫోన్ చేసి డబ్బులు తీసుకొని వెను తిరిగి వెళుతున్న క్రమంలో పోలీసులు అడ్డగించి అనుమానం ఉందని చెప్పి జీపులో ఎక్కించుకొని అకారణంగా దాడి చేశారని, దాడికి పాల్పడిన నలుగురు పోలీసు సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం తిరుపతి నగర కార్యదర్శి కె. వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. కానిస్టేబుల్ స్టీల్ బాటిల్ తో కొట్టడంతో ఆటో డ్రైవర్ మధుకు ఎడమ దవడ ఎముక చిట్లిందని, పళ్ళు కూడా చీలికలు వచ్చి స్టీల్ ప్లేట్ లు అమర్చాలని వైద్యులు సూచించారని చెప్పారు. అకారణంగా ఇష్టానుసారం బాధ్యత రాహిత్యంగా కొట్టడమే కాక బూతులతో తిడుతూ మానసికంగా ఇబ్బందులకు గురిచేసిన పోలీసులపై కఠినంగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.సుబ్రహ్మణ్యం, నాయకులు మాధవ్, పి.బుజ్జి, ఎం.నరేంద్ర, ఎం.జయంతి, ఎం.రాజు, సుజాతమ్మ, భార్గవి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించండి : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరంలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి పాదచారులకు ఇబ్బందులు లేకుండా చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం ఉదయం నగరంలోని గరుడ సర్కిల్, రుయా సర్కిల్, జూపార్కు రోడ్డు తదితర ప్రాంతాలను అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి తోపుడుబండ్లు, టిఫిన్‌బండ్లు ఏర్పాటు చేయడంతో పాదచారులకు ఇబ్బందులు వస్తున్నాయనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. జూపార్కు వెళ్లే మార్గంలోనూ టిఫిన్ బండ్లు ఎక్కువయ్యాయని, వారు వ్యర్థాలను రోడ్డుపక్కన పడేస్తున్నారన్నారు. దీనివల్ల వన్యప్రాణులు రోడ్లపైకి వచ్చి మనుష్యులపై దాడి చేస్తున్నాయని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసిపి మధు, డిఈ మధు, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

ఆర్టీవో ఆఫీసు రోడ్డును బాగు చేయండి : సిపిఎం



ఈ రోడ్డులో ప్రయాణం సాధ్యమేనా..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

మంగళం ఆర్టీవో ఆఫీస్ ఎదురు నుండి శెట్టిపల్లి రైల్వే రేటు వరకు ఉన్న 100 అడుగుల వెడల్పు రోడ్డును వెంటనే బాగు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ రోడ్డులో ప్రయాణికుల ఇబ్బందులను నేరుగా ప రి శీ లి ం చా న న్నా ర ం . వాహనదారులు ఆర్టీవో ఆఫీస్ నుంచి శెట్టిపల్లికి వెళ్ళాలన్నా, శెట్టిపల్లి గ్రామస్తులు తిరుపతికి రావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శెట్టిపల్లి రైల్వే గేటు నిర్మిస్తున్న సందర్భంగా అటు వెళ్లడానికి వాహనదారులకు వీలు లేకుండా పోయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా కల్పించాలన్న ఉద్దేశంతో తుడా కు సంబంధించిన మాస్టర్ ప్లాన్ రోడ్డును టీటీడీ కి అప్పగించి త్వరగా పనులు పూర్తి చేసేటట్టు గత ప్రభుత్వం నిర్ణయించింది. ఆ నిర్ణయం అమలులో ఇబ్బందులు కారణంగా ఇప్పటికి రెండు సంవత్సరాలు అవుతున్నప్పటికీ పనుల పురోగతి లేదు. శెట్టిపల్లి చెరువు నీటికి ఏర్పాటుచేసిన కల్వర్టును పడగొట్టి కొత్త కల్వర్టు నిర్మించక కల్వర్టు పక్కదారి సక్రమంగా ఏర్పాటు చేయక కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి టీటీడీ పాలకమండలి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉన్నప్పటికీ పనులు చేపించడంలో తగిన శ్రద్ధ చూపలేదని ఆయన ఆరోపించారు. ఈ కారణంగా శెట్టిపల్లి భూములను అభివద్ధి చేసి అక్కడ వారికి ప్రభుత్వం ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియకు ఇబ్బంది కలుగుతోందన్నారు.వర్షం పడితే ప్రజల బాధలు వర్ణనాతీతమని, వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరారు.



అట్టహాసంగా ముగిసిన నారాయణ ప్రీమియర్ లీగ్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్‌కళాశాలల క్రీడా పోటీలు "నారాయణ ప్రీమియర్ లీగ్ 2025" శుక్రవారం ఘనంగా ముగిసింది. నారాయణ ఉన్నత బాలుర పాఠశాలలో జరిగిన ముగింపు వేడుకలో విద్యార్థులు తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, శారీరక, మానసిక దఢత్వానికి దోహదపడతాయి అన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయం" అన్నారు. అంతేకాక తమ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. నారాయణ విద్యాసంస్థల డీజీఎం జె. కొండలరావు మాట్లాడుతూ ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా 17 కళాశాలల నుండి దాదాపు 1000 మందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారని, విద్యార్థులకు క్రీడలు శారీరక దఢత్వాన్నే కాకుండా జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను తట్టుకునే మానసిక దఢత్వాన్ని ఇస్తాయని పేర్కొన్నారు. తమ విద్యాసంస్థలు క్రీడలకు కూడా అత్యంత ప్రాధాన్యతనిస్తాయని, అందువల్లనే తమ విద్యార్దులు అత్యంత ఒత్తిడితో కూడిన వివిధ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ర్యాంకులు సాధించ గలుగుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్స్ వేణుగోపాల్, చక్రవర్తి, సురేష్, స్కూల్ ఏజిఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

12-14 తేదీల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి వేదికగా డిసెంబర్ 12, 13,14 తేదీలలో జరగబోయే ఎస్ఎఫ్ఐ 25వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పట్టణ కార్యదర్శి గురవయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రపంచ బ్యాంకు, కార్పొరేటీకరణకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని గురవయ్య మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఇందులో భాగమేనన్నారు. ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకవసరమైన పలు తీర్మానాలను మహా సభల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు పురపాలక సంఘం నూతన మున్సిపల్ కమిషనరుగా డివి నాగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మంజునాథ గౌడ్ కావలి మున్సిపల్ కార్యాలయానికి మేనేజర్ గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషనరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి దృష్టి సారిస్తానని తెలిపారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని చెన్నై రోడ్డు గుంతలమై వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలం సబ్ ఇంజనీర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన హరిప్రసాద్ రోడ్డు పరిస్థితి గమనించి శుక్రవారం రోడ్ కాంట్రాక్టర్ అశోక్‌తో మాట్లాడి తాత్కాలికంగా గుంతలమైన రోడ్డుకు ప్యాచ్ వర్క్ చేయించారు. అనంతరం ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడగా, వర్షాలు తగ్గిన తర్వాత, డిసెంబర్ చివరి వారంలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆర్ అండ్ బి అధికారులు తెలియజేశారు.

వైసీపీ నుండి టిడిపిలో చేరిన అమాస రాజారెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలం, బాలినాయుడు కండ్రిగ పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు అమాస రాజారెడ్డి, మాజీ సర్పంచ్ పరంధామ రెడ్డి తమ అనుచరులతో కలిసి శుక్రవారం టీడీపీలో చేరారు. వీరికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం పథకాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు అమాస సోదరులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మురళి రెడ్డి, ధనుంజయులు నాయుడు, మహిళ నాయకురాలు హైమావతి, తెలుగుదేశం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా అందిస్తాం




ప్రజాశక్తి - బాలాయపల్లి : యూరియా కార్డు పొంది న ప్రతి రైతుకు యూరి యా అందిస్తామని జ యంపు సొసైటీ అధ్యక్షులు సింగం శెట్టి భాస్కర్ రావు తెలిపారు. శుక్రవారం మండలంలోని జయంపు గ్రామంలో, జయంపు సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పాళ్ళ మాధవ నాయుడు, ఉప ఎంపీపీ బట్టేపాటి మురళి మోహన్ రెడ్డి, శేషమనాయుడు, వెంకటేశ్వర్లు, రఘు నాథ్ రెడ్డి, అమ్మినేని మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : కోట మండలం, గూడలి గ్రామం సచివాలయం ప్రాంగణంలో వాకాడు ఏఎంసీ చైర్‌పర్సన్ దారా ప్రమీల చేతుల మీదుగా శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ సీనియర్ నాయకులు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, ఎంపిటిసి దారా సురేష్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాలకు సంబంధించిన విద్యుత్ సమస్యలను, రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సిఎండి శివశంకర్‌ను కోరారు. శుక్రవారం తిరుపతిలోని ఏపీ ఎస్పీడిసీఎల్ సీఎండీ కార్యాలయంలో సీఎండీ శివశంకర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. పిచ్చాటూరు మండలం, ముడియూరులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, సత్యవేడు మండలం, చమర్తి కండ్రిగలో చివరి దశ నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ను త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని కోరారు. తన వినతులకు సీఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అంగన్వాడి కేంద్రాల విలీనం ఆపండి



ప్రజాశక్తి - వరదయ్యపాలెం : అంగన్‌వాడీ కార్యకర్తలకు కేటాయించిన అదనపు ఆన్‌లైన్ పని, కేంద్రాల విలీనాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని అన్ని సచివాలయాలల్లో సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకురాలు శాంతి మాట్లాడుతూ ప్రీస్కూల్ పిల్లలతో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలనే అభ్యర్థనకు సంబంధించి, అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయడాన్ని నిలిపివేయాలని, 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉండేలా ఒక (ప్రభుత్వ ఉత్తర్వు) జారీ చేయాని కోరారు. ప్రీస్కూల్ పిల్లలకు తల్లి కి వందనం అమలు చేయాలని, ఎస్ఆర్ఎస్‌ను రద్దు చేసి మెనూ పరిమాణాన్ని పెంచాలని, ప్రీస్కూల్ పిల్లలకు యూనిఫాం, టై, బెల్ట్ , బూట్లు అందించాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఏపీఎస్ ఆర్టీసీ కార్మికుల ధర్నా



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు ఆర్టీసీ డిపో ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఏపీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, స్త్రీ శక్తి పథకం ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించాలని జీరో టిక్కెట్‌కు పెట్టే ఖర్చును ఆర్టీసీ సంస్థకు జమ చేయాలని, ప్రతి మహిళకు స్మార్ట్ కార్డులు ఇవ్వాలని, 1/2019 సర్కులర్ అమలు చేయాలని, విజయవాడ, ఆటోనగర్, తిరుపతి వంటి 21 బస్ స్టేషన్లను ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చే చర్యలను తక్షణమే నిలిపివేయాలని, సిబ్బంది ప్రమోషన్లను తక్షణమే చర్యలు చేపట్టాలని, సిబ్బందిపై దాడులు చేసే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టాలని, పలు సమస్యలపై ధర్నా చేపట్టారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. పలు గ్రామాల నుండి ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. ఆయన కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవిన్యూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ ఈఈ నరేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యమా.. ఎక్కడ నీ చిరునామా..?

- పారిశుధ్య నిర్వహణకు ప్రభుత్వాలు పెద్ద పీట.. అమలు మాత్రం శూన్యం..!
- అస్తవ్యస్తంగా మురుగు కాలువలు
- రక్షిత తాగు నీరూ కరువే
- సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతం
- నామమాత్రపు చర్యలతో అధికారులు మమ
- చంద్రగిరి మండలంలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - చంద్రగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్తున్నా దాని అమలు ఎక్కడా కన్పించడం లేదు. పారిశుధ్య చర్యలు లేక గ్రామాలు కంపు కొడుతున్నాయి. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నినాదాలకే పరిమితమైందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, రక్షిత మంచినీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో రోగాలబారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చర్యలే తప్ప శాశ్వత చర్యలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి మండలం, రంగంపేట పంచాయతీలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోయింది. రంగంపేట బస్టాండ్ నుంచి భీమవరం రోడ్డ వెంట, గ్రామ సచివాలయం దగ్గర, పశు వైద్యశాల దగ్గర చెత్త, చెదారాలు పడేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు జీతాలు సరిగా ఇవ్వడం లేదని పనులు మానేశారు. గ్రామంలోని పలు కాలనీల్లో కాలువ నిర్మాణాలు సరిగా లేక మురుగు నీరు దిగువకు వెళ్లక నిల్వ వుంటూ దోమలకు ఆవాసాలవుతున్నాయి. తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





పారిశుధ్య పనులు చేపడతాం

రంగంపేటలోని పలు కాలనీల్లో పారిశుధ్య పనులు వెంటనే చేపడతాం. పంచాయతీలో నిధుల కొరత ఉన్నప్పటికీ మండల అభివృద్ధి అధికారి, ప్రజాప్రతినిధుల సహకారంతో మురుగు నీరు నిల్వ వున్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాం. పారిశుధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు కూడా గతంలో అందజేశాం. త్వరలో కొత్తవారిని నియమిస్తాం. అలాగే గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

- సురేష్ బాబు, ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి

మా కాలనీకి దారి చూపించండి.. ఎమ్మెల్యేకు వినతి



ప్రజాశక్తి - నాయుడుపేట: మాపై దయ వుంచి మా కాలనీకి దారి చూపించండంటూ ఎంఎస్ఆర్ కాలనీవాసులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కలసి వినతి పత్రం అందజేశారు. నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీ, విన్నమాల గిరిజన కాలనీ ప్రజలు గత 50,60 సంవత్సరాలుగా పట్టణంలోకి వచ్చేందుకు వినియోగిస్తున్న కాలనీ నుంచి పట్టణంలోకి అర కిలోమీటర్ కూడా లేని దారిని మూసివేసి దాదాపుగా 5 కిలోమీటర్లు తిరిగి రావాలంటూ రైల్వే అధికారులు సూచించడం దారుణమని తెలిపారు. తమ సమస్యను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. కాలనీవాసులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పరిధిలో ఎన్ఎస్ఆర్ కాలనీలోని 78వ నెంబర్ రైల్వే గేటును మరమ్మతుల పేరుతో గుత్తేదారులు గత నాలుగు నెలలుగా మూసేశారని తెలిపారు. ఈ గేటు మూసేయడంతో ఉద్యోగాలకు, కూలీ పనులకు, పాఠశాలలకు వెళ్లే మహిళలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక వృద్ధులు, వికలాంగులయితే నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. చుట్టూ తిరిగి పోవాలంటే రాత్రి వేళల్లో మహిళలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి వినతిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తడుకు చందు, గోవిందు శ్రీనివాస్, జడ వెంకటేష్, కప్పల మునస్వామి, దార శేఖర్, మోహన్, అశోకు, వెంకటేశ్వర్లు, పెంచలయ్య, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం



ప్రజాశక్తి - రామచంద్రాపురం, చంద్రగిరి : చంద్రగిరి నియోజకవర్గంలో ప్రతి టిడిపి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకొని, చెప్పుడు మాటలు వినకుండా కార్యకర్తల నిర్ణయమే శిరోధార్యంగా భావించి, కార్యకర్తలే పార్టీకి అధినేతలగా గుర్తింపు ఇస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్‌లోని చంద్రగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ మండల, గ్రామ కమిటీ అధ్యక్షులు ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గం టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, పూతలపట్టు శాసనసభ్యులు డాక్టర్ కె మురళీమోహన్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. టీడీపీ జెండా అవిష్కరించి, ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. ఇటీవల నియోజకవర్గంలో మృతి చెందిన కార్యకర్తలకు సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో అందరం కలిసికట్టుగా పనిచేసి టిడిపి మద్దతుదారులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మేకల తిరుమలరెడ్డి, ఏ ఈశ్వర్ రెడ్డి, బెల్లంకొండ మురళి, బడి సుధా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బోనుపల్లెకు వానర కష్టాలు .. పట్టించుకోని అధికారులు





వృద్ధురాలిపై దాడి చేసిన కోతులు, నీటి ట్యాంకులో కోతి కళేబరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు) మండలంలోని బోనుపల్లి గ్రామాన్ని వానర కష్టాలు వెంటాడుతున్నాయి. ఎక్కడ నుంచో వలస వచ్చిన వానర సమూహాలు గత 2 నెలలుగా గ్రామంలో తిష్ట వేసి ప్రజలను అష్ట కష్టాలు పెడుతున్నాయి. గుంపులు గుంపులుగా ఇళ్లు, చెట్లపై దాడి చేస్తున్నాయి. ఇళ్లల్లోకి దూరి చేతికందిన తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. ఆ సమయంలో ఎవరైనా వానరాలను తరిమే ప్రయత్నం చేస్తే పైన పడి రక్కేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పది రోజుల కిందట బోనుపల్లి దళితవాడకు చెందిన జయమ్మ అనే వృద్ధురాలిని ఓ వానరం దాడి చేసి కరిచింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి అనారోగ్యం పాలైంది. బోనుపల్లి దళిత వాడలోని మంచి నీటి ట్యాంకు, బోనుపల్లి గ్రామంలో ఉన్న అసంపూర్తి ఇంటిని ఆవాసాలుగా చేసుకుని సుమారు వందకు పైగా వానరాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వానరాలను గ్రామం నుంచి వెళ్లగొట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చాలా సార్లే అర్జీలు సమర్పించినా నిధుల్లేవంటూ తప్పించుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగానే శుక్రవారం ఉదయం బోనుపల్లి దళితవాడలో ఉన్న మంచి నీటి ట్యాంకు లోపల మృతి చెందిన ఓ వానర కలేబరాన్ని యువకులు గుర్తించారు. పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో దాన్ని బయటకు తీసి ట్యాంకును శుభ్రపరిచారు. అయితే ట్యాంకుకు నీటిని సరఫరా చేస్తున్న మోటారు గత వారం రోజులుగా పనిచేయకపోవడంతో గ్రామస్తులకు పెద్ద ప్రమాదమే తప్పింది. మరో ప్రత్యామ్నాయ మోటార్ నుంచి నేరుగా నీటిని సరఫరా చేయడంతో ట్యాంక్ నీటిని వాడే అవకాశం లేకపోయింది. లేకుంటే ట్యాంక్ నీటిని వాడి దళితులంతా అనారోగ్యం పాలయ్యేవారే. ఇకనైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

ఘనంగా రాజ కుటుంబీకుడి జయంతి

ప్రజాశక్తి- వెంకటగిరి: వెంకటగిరి సంస్థానంలో 31వ తరం రాజు, మాజీ ఎమ్మెల్యే వెలుగోటి వెంకటశేష వరదరాజ గోపాలకృష్ణ యాచేంద్ర 101 జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజా కుటుంబీకుడు సర్వజ్ఞ కుమార చంద్ర స్థానిక కైవల్యానది సమీపంలో ఉన్న వివివిఆర్‌కె యాచేంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి అభివృద్ధికి, వెంకటగిరి ప్రాంత ప్రజల అభ్యున్నతికి రాజా కుటుంబం అండగా ఉంటుందని తెలిపారు. రాజకీయ రంగంలో ఎమ్మెల్సీగా ఎమ్మెల్యేగా వివివిఆర్‌కె యాచెంద్ర పేదల పక్షాన ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ వివివిఆర్‌కె యాచేంద్ర సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళా వర్సిటీలో బిజినెస్ లీడర్‌షిప్‌పై సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ లో ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ వారు డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్ మెంట్, డిపార్ట్మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ అండ్ హ్యుమానిటీస్ ఆధ్వర్యంలో 'విజయవంతమైన వ్యవస్థాపకుడు (ఎంట్రీ ప్రెన్యూర్)' అనే సెమినార్ నిర్వహించారు. దీనికి ముఖ్య వక్తగా తిరుపతి కౌటిల్య ఇన్స్టిట్యూషన్ డైరెక్టర్ శ్రీధర్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగాధిపతి జి.లత, బేసిక్ సైన్స్ డిపార్ట్మెంట్ లోని అకడమిక్ కన్సల్టెంట్ జె.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్టార్ట్ అప్ లాంటి బిజినెస్ స్థాపించాలంటే ముఖ్యంగా ఔత్సాహికులకు ఉండవలసిన లక్షణాలను తెలియజేశారు.

క్రీడాకారులు మరెన్నో విజయాలు సాధించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల ఆర్చరీ పోటీల్లో బంగారు, సిల్వర్ పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆర్చరీ కోచ్ శివశంకర్ మాట్లాడుతూ విజయవాడలో జరిగిన సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలో గూడూరు ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు గోల్డ్ , సిల్వర్ మెడల్స్ సాధించారని, రాబోయే రోజుల్లో మరెన్నో విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య ,పెంచలయ్య, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

తూ.. తూ.. మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రేణిగుంట: మండల కేంద్రంలో శుక్రవారం సాధారణ సర్వసభ్య సమావేశం తూతు మంత్రంగా నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వైసిపి మండల కన్వీనర్ హరి ప్రసాద్ రెడ్డి, టీడీపీ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ తదిరతరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ తీరుపై విద్యార్థుల ధర్నా



ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తీరును నిరసిస్తూ పలువురు విద్యార్థులు కళాశాల ఎదుట రహదారిపై సిపిఎం పార్టీ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారి ధర్నా చేపట్టారు. పరీక్ష ఫీజు చెల్లింపు గడువు శుక్రవారం ముగియడంతో దీనిపై సంబంధిత ప్రిన్సిపాల్ వైఖరి భిన్నంగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ నాయకులు దేశాండి అరుణాచలం మాట్లాడుతూ ప్రస్తుతం డిగ్రీ కళాశాలలో ద్వితీయ, ఫైనల్ సంవత్సర విద్యార్థులు దాదాపు 70 మంది పరీక్షలు వ్రాయడానికి ఫీజులు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే విద్యార్థులకు తగిన సమాచారం లేకపోవడంతో ఇందులో సగం మంది ఫీజులు చెల్లించలేదన్నారు. ప్రిన్సిపల్ ఇష్టారాజ్య వ్యవహార శైలిని ప్రశ్నించినందుకే కక్షపూరితంగా ఫీజులు కట్టించుకోకుండా తన చుట్టూ తిప్పించుకుంటూ కాలయాపన చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తపరిచారు. అటెండెన్సు విషయంలో కూడా విద్యార్థులను వేధిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చేపడుతున్న ధర్నాతో ఉత్తుకోట-సత్యవేడు రహదారిపై ట్రాఫిక్ అంతరాయం కలడంతో సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై రామస్వామి సంఘటన స్థలానికి చేరుకున్నారు. కళాశాల అధ్యాపకులతో చర్చించారు. ఆర్జెడితో, కళాశాల ప్రిన్సిపాల్ సుజాతతో ఫోన్‌లో మాట్లాడి వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. ప్రిన్సిపాల్ సమాధానం ఇస్తూ అటెండెన్స్ 50 శాతం ఉంటేనే పరీక్ష ఫీజులు చెల్లింపుకు అవకాశం ఉంటుందని తెలిపారు. 50 శాతం హాజరు ఉన్న విద్యార్థులు అందరితో పరీక్ష ఫీజు తీసుకొని ఆన్లైన్లో నమోదు చేయాలని ఇంచార్జి ప్రిన్సిపాల్ అరవిందుకు ప్రిన్సిపాల్ సుజాత సూచించారు. అయితే జీరో శాతం హాజరు ఉన్న విద్యార్థుల నుంచి కూడా పరీక్ష ఫీజు తీసుకోవాలని విద్యార్థి సంఘం సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు అరుణాచలం,డిగ్రీ కళాశాల విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



ప్రజాశక్తి - వరదయ్యపాలెం: అంబూరు పంచాయతీలో బాలల దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పరీక్ష ప్యాడ్లను సింగిల్ విండో చైర్మన్ ఆణిముత్యం నంద కిషోర్ రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జవాహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా మన దేశానికి ఎంతో సేవ చేశారని పిల్లలంటే నెహ్రూకు చాలా ఇష్టమని అందుకే ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పిల్లలందరూ బాగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, దుర్గారావు, కె శ్రీనివాసు రావు, ఉదయ్ రేఖ వాలంటరీ వర్ష తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని నారాయణ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డీ.జి.ఎం కొండలరావు, తిరుపతి రీజియన్ ఏ.జీ.ఎం డాక్టర్ శ్రీనివాసులు, ఆర్.ఐ కిరణ్ కుమార్‌లు విచ్చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఏ.వో రాజేష్, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, విద్యాస్ వికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలను కరెస్పాండంట్ విద్యాప్రకాష్ రెడ్డి అధ్యక్షతన, ప్రిన్సిపాల్ మేరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతుల అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని కళ్లివెట్టు ఉన్నత పాఠశాల, బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య ప్రధానోపాధ్యాయురాలు వాణి, వ్యాయామ ఉపాధ్యాయులు దాసు ఆధ్వర్యంలో పిల్లలకు ఆటలు పోటీలు నిర్వహించి, విజేతలకుబహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, లక్ష్మయ్య, జగన్నాథం, మాధవీలత, సుజన, రమేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెండ్ల మురళి, వినోద్, రత్నకుమారి, హరిత, జ్యోతి, విద్యా వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుమల: తిరుపతి స్థానిక టీఎస్ఎన్ పురంలోని శ్రీ చైతన్య పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ ప్రసన్న



మాట్లాడుతూనెహ్రూస్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం సురేష్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ డాక్టర్ మోహన్ బాబు, జోనల్ కోఆర్డినేటర్ సుధా నాయర్, డీన్ రాజశేఖర్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ.. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ప్రత్యేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ ట్రైబ్ బాలబాలికల్లో రోజూ 3 కిలోమీటర్లకుపైగా నడిచి పాఠశాలకు హాజరవుతున్న 30 మంది విద్యార్థులకు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల గారి సౌజన్యంతో సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా డీఈఓ కె.వి.ఎన్. కుమార్ మాట్లాడుతూ విద్యకు గిరిజన బాలబాలికలు దూరం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అధికారులు శివశంకర్, సురేష్, డాక్టర్ సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

15 కేజీలు గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఏఎంసి చెక్ పోస్ట్ వద్ద స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న గుర్తు తెలియని వ్యక్తిని చెక్ పోస్ట్ దగ్గర ఆపి తనిఖీ చేయగా, అతని దగ్గర 15 కేజీలు గంజాయి పట్టుబడింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో బుచ్చినాయుడు కండ్రిగ సబ్ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, సుధీర్‌లు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుండి సూళ్లూరుపేటకు రైలులో వచ్చి, ఆటోలో తిరుపతి వైపు పోతున్న వ్యక్తిని చెక్‌పోస్ట్ దగ్గర అదుపులోకి తీసుకొని 15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. తహశీల్దార్ శ్రీదేవికి సమాచారం అందించి, సిఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది రమేష్, సురేష్, గురవయ్య పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానాలు

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం సబ్ ఇన్స్పెక్టర్ ఏ.నాగబాబు సమాచారం మేరకు ఈరోజు శుక్రవారం జమీన్ కొత్తపాలెం పంచాయతీ తూపిలిపాలెం బీచ్ రోడ్డు వద్ద తమ పోలీసు సిబ్బందితో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించి తాగి వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి వారిని కోర్టుకు హాజరుపరచగా, కోర్టు వారికి మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు గాను ఒక్కొక్కరికి పదివేల రూపాయలు జరిమానా విధించారన్నారు. హెల్మెట్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగబాబు తెలిపారు.

స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం

తమ బిడ్డ చేయి విరిగినా సమాచారం ఇవ్వలేదని తల్లిదండ్రుల ఫిర్యాదు



ప్రజాశక్తి-చంద్రగిరి: స్కూల్లో ఓ విద్యార్థి కిందపడి చేయి విరిగినా స్కూల్ యాజమాన్యం పట్టించుకోలేదంటూ తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించిన ఘటన శుక్రవారం చంద్రగిరిలో జరిగింది. చంద్రగిరిలో చైతన్య టెక్నో స్కూల్‌లో ఎల్‌కేజీ చదువుతున్న మహానాయక్(4)కు తన తల్లి భోజనం తినిపించి ఇంటికి వెళ్ళిపోయింది. తరువాత ఆ విద్యార్థి తోటి పిల్లలతో ఆడుకుంటూ తాగు నీటి కోసం పై అంతస్థుకి మెట్లు ఎక్కుతూ కిందపడటంతో చేయి విరిగింది. వెంటనే తల్లితండ్రులకు సమాచారం అందించకుండా స్కూల్ యాజమాన్యం అక్కడే ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసుకెళ్లగా చేయి బాగా విరిగిందని వెంటనే తిరుపతి బర్డ్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఈ విషయాన్ని స్కూల్ యాజమాన్యం ఆలస్యంగా తల్లిదండ్రులకు తెలిపారు. తల్లి తండ్రులు హుటాహుటిన బయలుదేరి తిరుపతి బర్డ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బాలుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇది జరిగి రెండు రోజులు కావస్తున్నా స్కూల్ యాజమాన్యం ఏమాత్రం పట్టించుకోలేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి ఫీజులు మాత్రం ముక్కు పిండి వసూలు చేస్తారని, పిల్లల్ని మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు ఇటు భాదితులను, స్కూల్ యాజమాన్యాన్ని విచారిస్తున్నారు.

ప్రేమ వివాహం వివాదంలో కత్తితో దాడి

ప్రజాశక్తి - చంద్రగిరి: తన సోదరిని ప్రేమ వివాహం చేసుకొన్నాడని, సోదరి భర్తపై ఆమె తమ్ముడు హేమసాయి భగత్ బీరు బాటిల్‌తో దాడి చేసాడు. పోలీసుల కథనం మేరకు తిరుపతికి చెందిన చందనశ్రీ, చంద్రగిరికి చెందిన జయప్రకాష్ ఆచారిని గత నెల 5వ తేదిన ప్రేమే వివాహం చేసుకొంది. వీరి కులాలు వేరు కావడంతో చందనశ్రీ కుటుంబ సభ్యులు ప్రేమ వివాహానికి ఒప్పుకోలేదు. అయితే పెళ్ళి సమయంలో చందనశ్రీ తమ్ముడు హేమసాయి ఓ క్రిమినల్ కేసులో రిమాండ్లో ఉన్నాడని, దీంతో రిమాండ్ నుంచి బయటకు విడుదలయ్యాక తనతో, తన భర్తతో ఫోన్లో మాట్లాడి, ఇంట్లో కుటుంబ సభ్యులను ఒప్పించి వివాహం చేసుకోవాల్సి ఉండాల్సిందని చెప్పాడని తెలిపారు. అయితే శుక్రవారం సాయంత్రం హేమసాయి తన స్నేహితులతో కలిసి రెండు ద్విచక్ర వాహనాలలో చంద్రగిరి, జమండ్లవీధికి వచ్చి భగత్‌పై బీరు బాటిల్తో దాడి చేసి, కత్తితో పొడవడానికి ప్రయత్నించగా, భగత్ చెయ్యి అడ్డంపెట్టడంతో చేతికి రక్త గాయమైంది. భగత్ కేకలు వేయడంతో హేమసాయి, స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో స్థానికులు భగత్‌ను చికిత్స నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. చందనశ్రీ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

పీజీ కోర్సులపై అవగాహన

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక డిఆర్‌డబ్ల్యు కళాశాలలో శుక్రవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న పీజీ కోర్సుల వివరాలను తెలియజేశారు. మెరైన్ బయాలజీ కోర్స్‌తో విద్యార్థులకు లభిస్తున్న ఉపాధి అవకాశాలు, సీటు సాధించిన 15 మంది మెరిట్ విద్యార్థులకు నెలకు పదివేల రూపాయల ఫెలోషిప్, పది నెలల పాటు రెండు సంవత్సరాలు అందిస్తున్నట్లు తెలియజేశారు. నాలుగవ సెమిస్టర్ లో ఇంటర్న్‌షిప్ చేసేప్పుడు ఆరు నెలల పాటు ప్రతినెల ఐదు వేల రూపాయలు చెల్లిస్తారని తెలిపారు.

నృత్య వాహిని



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో "నృత్య వాహిని"అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి నృత్య మహోత్సవంలో రెండవ రోజు థాయ్‌లాండ్‌కు చెందిన ట్రెడిషనల్ ఆర్ట్ ఫార్మ్ ఖోన్ డాన్స్, (థాయ్ డ్రామాటిక్ ఆర్ట్స్, చియాంగ్ మై రాజభాట్ యూనివర్సిటీ) డా. విపడా పెచ్చాట్ వర్కుషాపులో నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులు ప్రాక్టికల్ డెమాన్‌స్ట్రేషన్‌లో నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. మధ్యాహ్నం గర్బా నృత్యం (గుజరాత్ ప్రజా నృత్యం) పై వర్క్‌షాప్ జరిగింది. దీన్ని మహారాష్ట్రలోని లే అండ్ నృత్యాంగణ స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్‌కి చెందిన శుభమ్ బిర్కురే, బృందం నిర్వహించారు... రోజు చివర్లో "ఇంటర్‌కల్చరల్ డాన్స్ డైలాగ్" అనే ప్యానెల్ చర్చ నిర్వహించారు. మహిళా వర్సిటీలోని కార్యక్రమాలు ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి సహకరించండి



ప్రజాశక్తి-ఏర్పేడు: మునగల పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, విద్యా విషయాలకు సంబంధించి జరిగిన సోషల్ ఆడిట్ గ్రామసభను డిఆర్పి చెంచు కృష్ణయ్య నిర్వహించారు. ఈ గ్రామ సభలో పాల్గొన్న ఎంఈఓ ఏ.దయాకర్ విద్యార్థుల తల్లిదండ్రులు వారి సమగ్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు బాలాజీ, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని వెలికి తీసేందుకే క్విజ్ పోటీలు



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పిల్లల్లో ఉండే విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గూడూరు మండల స్థాయిలో కౌన్ బనేగా ఛాంపియన్ క్విజ్ పోటీలు త్వరలో జరుగుతాయని గూడూరు డిప్యూటీ డిఈఓ సనత్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కౌన్ బనేగా ఛాంపియన్ క్విజ్ పోటీల లోగోను డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు ఆవిష్కరించారు. డిప్యూటీ డిఇఓ మాట్లాడుతూ ఈ పోటీలు గూడూరు మండల స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని, విజయవంతమైతే డివిజన్ స్థాయిలో కూడా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాంచన, కరస్పాండెంట్లు దశరథరామిరెడ్డి, మౌనిష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో ఎస్పిడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు విజయవాడలో నవంబర్ 3 నుంచి 6వ తేదీ వరకు జరిగిన 69వ ఎస్ జిఎఫ్ అంతర్ జిల్లాల కుస్తీ ఛాంపియన్ షిప్ -2025 అండర్ 17 బాలిక, బాలుర విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, బంగారు పతకాలని కైవసం చేసుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డా.భువనేశ్వరి అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయిసుమతిని అభినందించారు. విజేతల వివరాలు డి. హేమనిధి జూనియర్ ఎమ్ ఈ సి -గోల్డ్ మెడల్, వై. స్వాతి లక్ష్మి జూనియర్ బైపిసి -గోల్డ్ మెడల్, ఎన్.పూజిత -జూనియర్ బైపిసి గోల్డ్ మెడల్, ఎమ్.ఆర్షిత వర్షిణి జూనియర్ ఎంపీసి -కంచు మెడల్ గెలుచుకున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి - కేవీబి పురం: తిరుపతికి చెందిన గ్లోబల్ రీచ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగూట్ల ఆధ్వర్యంలో కళత్తూరు వరద ముంపు విద్యార్థులు 400 మందికి నోటు పుస్తకాలు, ప్యాడ్, పెన్ను, బ్యాగు, యూనిఫారం, దస్తులు తదితర వస్తువులను జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ ఆధ్వర్యంలో కేవిబి పురం జడ్పీ హైస్కూల్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యంఈఓలు లక్ష్మీపతి కుమార్, హై స్కూల్ హెడ్మాస్టర్ సురేష్, తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ట్రస్టు కార్యదర్శి నాగార్జున, జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్దన్, సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో విద్యకు ప్రాధాన్యత



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు పేర్కొన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆయన వడమాలపేట మండలం, రామసముద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్సిల్స్, చాక్ లెట్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్టీసెల్ నియోజకవర్గ నాయకుడు ప్రవీణ్ పూల, నాయకులు షబ్బీర్, కృష్ణ ముదిరాజ్‌పాల్గొన్నారు.

13 గోల్డ్ అవార్డులు గెలుచుకున్న అమర రాజ

ప్రజాశక్తి - రేణిగుంట: తైవాన్‌లోని తైపీ నగరంలో జరిగిన 50వ అంతర్జాతీయ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్స్ కన్వెన్షన్‌లో అమర రాజా గ్రూప్ మరోసారి అసాధారణ విజయం సాధించింది. 14 దేశాల నుండి పాల్గొన్న 884 బృందాల పోటీలో, అమర రాజా తరపున పాల్గొన్న 13 బృందాలన్నీ గోల్డ్ అవార్డులను సాధించాయి. ఈ విశేష విజయం సంస్థ యొక్క ప్రపంచ-స్థాయి నాణ్యతా ప్రమాణాలు నిరంతర మెరుగుదల పట్ల నిబద్ధతను మళ్ళీ నిరూపిస్తుంది. ఐసిక్యూసిసి ప్రపంచవ్యాప్తంగా నాణ్యతా పద్ధతులు, సమస్య పరిష్కార విధానాలు, బృంద ప్రాతిపదికన ఆవిష్కరణల ప్రదర్శనకు అత్యుత్తమ వేదికగా గుర్తింపు పొందింది. ఈ అంతర్జాతీయ వేదికపై అమర రాజా సాధిస్తున్న వరుస విజయాలు సంస్థలో ఉన్న ఆపరేషనల్ ఎక్సలెన్స్ ప్రజా-కేంద్రిత సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఈ సందర్భంగా అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన్ గౌరినేని మాట్లాడుతూమా ఉద్యోగుల క్రమశిక్షణ, కృషి, నిబద్ధతకు ఈ విజయం గొప్ప నిదర్శనం. అంతర్జాతీయ వేదికపై సాధించిన ఈ గౌరవం అమర రాజా నాణ్యత, ఆవిష్కరణ, సామర్థ్య వికాసంపై ఎంతో దృష్టి పెట్టిన సంస్థ అని మరొకసారి నిరూపిస్తోంది. భవిష్యత్తులో కూడా మా వ్యవస్థలను బలోపేతం చేస్తూ, మా ఉద్యోగ లను ప్రపంచ-స్థాయి ప్రదర్శనకు సిద్ధం చేయడంలో ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ నరసింహులు నాయుడు మాట్లాడుతూ అమర రాజాలో నాణ్యత అనేది ప్రతి చర్యకు మార్గదర్శకమైన ప్రాథమిక దృక్పథం. ఈ అవార్డులు సహకారం, ఆవిష్కరణలతో అసాధారణ ఫలితాలను సాధించగలమనే మా నమ్మకాన్ని మరింత బల పరుస్తాయన్నారు. ఈ 13 గోల్డ్ అవార్డులు, సంస్థలోని ప్రతి స్థాయి వరకు నాణ్యతా సంస్కృతిని వ్యాప్తి చేయాలనే అమర రాజా యొక్క అచంచల నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయి. బలమైన ప్రాసెసులు, శక్తివంతమైన బృందాలు, కస్టమర్లకు సమాజానికి సుస్థిరమైన విలువను అందించాలనే సంకల్పం ఈ విజయానికి మూలాధారం. ఈ అవార్డ్స్ గెలుచుకున్న అన్ని బృందాలకు అమర రాజా చైర్మన్ గల్లా జయదేవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక గేట్ పుత్తూరు, కామరాజు నగర్ సమీపంలోని కళ్యాణ మండపంలో సేంగుందర్ మక్తల్ సంఘం ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సదర్భంగా గేట్ పుత్తూరు ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం అరవింద్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వచ్చే పేషెంట్లకు క్యూలైన్లను పాటించడం తాగునీరుని అందించడం వంటి సహాయ సహకారాలు అందించారు. ఈ కార్యక్రమంలో జై చంద్ర, శంకర్ స్కౌట్స్ డిస్టిక్ ఆర్గనైజింగ్ కమిషనర్ ఏ వెంకటేశ్వర్లు తదితర వాలంటరీస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు వితరణ



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్లో రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీ రత్నం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత, సీనియర్ ఆడిటర్ శ్రీకంటి రామ్మోహనరావు దాతృత్వంతో మినీ గురుకులంలో చదివే పేద విద్యార్థులకు కంటి అద్దాలను రామ్మోహనరావు చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించాలని, సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి, కార్యదర్శి రాఘవరెడ్డి, వాసు గౌడ్, శ్రీనివాసరావు, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, కోదండరామయ్య, గిరిబాబు, సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం ప్రారంభమైన రెండవ సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల నేపథ్యంలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రైవేటు క్లాసులను విద్యాశాఖ అధికారి ముని సుబ్రహ్మణ్యం పరిశీలించారు. బుచ్చినాయుడుకండ్రిగ, కల్లివెట్టు, నెలవాయి ఉన్నత పాఠశాలలో తరగతులను ఆయన పరిశీలించారు. విద్యా సంవత్సరానికి సంబంధించి పరీక్షలన్నీ ఒకే పుస్తకంలో విద్యార్థులు రాసేలా మూల్యాం కనం పుస్తకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాయులు రమణయ్య, వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి మీనా కుమారి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సుజాత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పాకాల: పాకాల గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాకాల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రోహిణి ముఖ్యఅతిదిగా హాజరైయ్యారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి కర్పూర హారతి ఇచ్చి హారతులు ఇచ్చారు. గ్రంథాలయ అధికారి తాళ్ల రవీంద్రబాబు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలో ఉపాధ్యాయులు, పాఠకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : గ్రంథాలయాలు విజ్ఞానానికి భాండాగారాలని శ్రీకాళహస్తి ఎంఈఓ 2 బాలయ్య పేర్కొన్నారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రధాన గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బాలల దినోత్సవం, గ్రంథాలయాల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. గ్రంథాలయాధికారి లావణ్య, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య పాల్గొన్నారు.

దుగరాజపట్నంలో పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, దుగారాజపట్నం గ్రామ పంచాయితీ, రైతు సేవా కేంద్రంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత పశు వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నట్టల నివారణకు మందులు, ఎదకురాని పశువుల కు మందులు ఇచ్చి, చూడి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాల శాతాన్ని పెంచే మందులు ఇవ్వడం జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన కోవూరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దాసరి శ్రీనివాస రావు గర్భ కోశ వ్యాధులు, నివారణ పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కోట మండల పశు వైద్యులు డాక్టర్ ఏంబేటి రాజేష్ , వాకాడు ప్రాంతీయ పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కార్తీక దీపోత్సవం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా కార్తీక వంచ దీపోత్సవం నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక దీపారాధన చేశారు. ముందుగా ఎస్వీ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళ ధ్వని, తిరుమల ధర్మగిరి వేద పాఠశాల ఆగమ పండితులు రాఘవేంద్ర వేదస్వస్తి, అనంతరం దీప ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి, శ్రీ చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారికి తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు వైఖానస ఆగమశాస్త్రబద్ధంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీనివాసర్చన నిర్వహించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం పండితులు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. ఆ తర్వాత అర్చక స్వాములు శ్రీ మహాలక్ష్మి పూజ చేపట్టారు. అనంతరం ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రదర్శించిన "శ్రీ లక్ష్మి ఆవిర్భవం" నృత్య రూపకం భక్తులను ఆద్యంతం ఆకట్టుకుంది. తరువాత భక్తులతో దీప మంత్రం మూడు సార్లు పలికిస్తూ సామూహిక లక్ష్మీ నీరాజనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులందరూ ఒక్కసారిగా చేసిన దీపారాధనతో మైదానం వెలుగుతో నిండిపోయింది. చివరగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు గోవిందనామాలు పాడుతుండగా నక్షత్రహారతి, కుంభహారతి సమర్పించారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు జి.భాను ప్రకాష్ రెడ్డి, జేఈవో వి. వీరబ్రహ్మం దంపతులు, తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులలో ఒకరు, ఆగమ సలహాదారులు కృష్ణశేషాచల దీక్షితులు, సంక్షేమ విభాగం డిప్యూటీ ఈవో ఆనందరాజు, హెచ్‌డిపీపీ సెక్రటరీశ్రీరాం రఘునాథ్, అర్చక బృందం, వేద పండితులతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బలపడుతున్న భారత్-జపాన్ పారిశ్రామిక బంధం



ప్రజాశక్తి - సత్యవేడు: భారతదేశ ఆర్థికాభివృద్ధిలో జపాన్ సంస్థల పెట్టుబడులు విస్తరిస్తూ భారత్-జపాన్ పారిశ్రామిక బంధం మరింత బలపడుతోందని, ఇందులో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగిన 30వ సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సులో 'భారత్-జపాన్ భాగస్వామ్యం' సెషన్‌లో ఆయన ప్యానెలిస్ట్‌గా పాల్గొన్నారు. జెసిసిఐసి చెన్నై ప్రెసిడెంట్ అకిరా హాంజావా, జెట్రో చెన్నై డైరెక్టర్ జనరల్ కౌరు షిరయిషి, ఇతర ప్యానెలిస్ట్‌లుగా పాల్గొనగా, సిఐఐ జాతీయ కమిటీ చైర్మన్, రాక్‌వెల్ ఆటోమేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్ సాహ్నీ సెషన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని కీలక ప్రసంగం చేయగా, భారత్‌లోని జపాన్ రాయబారి హనరబుల్ ఓనో కేయిచి ప్రత్యేక ప్రసంగం చేశారు. డా. సన్నారెడ్డి మాట్లాడుతూ, జపాన్ పెట్టుబడిదారుల అత్యంత ప్రాధాన్య గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ మారిందంటూ, శ్రీసిటీ భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌గా ఎదిగిందన్నారు. 300 ఎకరాల్లో ఏర్పాటు చేసిన జపాన్ ఎన్‌క్లేవ్‌లో 35 కు పైగా కంపెనీలు పనిచేస్తున్నాయని తెలిపారు. తద్వారా రూ.20,000 కోట్లకు పైగా పెట్టుబడులు, 20,000కు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయని వెల్లడించారు. ప్రత్యేకంగా రూపొందించిన మౌళిక సదుపాయాలు, రవాణా మార్గాల అనుసంధానం, చెన్నై పారిశ్రామిక కారిడార్ సమీపంలో ఉండడం వంటి అంశాలు శ్రీసిటీని జపాన్ కంపెనీలకు అత్యంత ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చినట్లు వివరించారు. అలాగే, శ్రీసిటీలోని జపాన్-ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాన్యుఫ్యాక్చరింగ్ నైపుణ్య కేంద్రం శిక్షణ ద్వారా స్థానిక యువతను జపనీస్ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తయారుచేస్తోందని చెప్పారు. చర్చల సమయంలో ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు, శ్రామికశక్తి లభ్యత, భవిష్యత్ విస్తరణపై జపాన్ ప్రతినిధులు ప్రశ్నలు అడగగా, సంపూర్ణ సహాయ సహకారాలు అందించేందుకు శ్రీసిటీ కట్టుబడి ఉందని డాక్టర్ సన్నారెడ్డి సమాధానమిచ్చారు.

ప్రత్యేక ఆకర్షణగా శ్రీసిటీ స్టాల్..

సదస్సులో ఏర్పాటు చేసిన శ్రీ సిటీ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వ్యూహాత్మక స్థానం, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను ప్రదర్శించే ఆకర్షణీయ డిజిటల్ ప్రదర్శనలు, 3%ణ% మోడళ్లతో పలువురి దృష్టిని ఆకర్షించింది. ఎఫ్‌ఎంసిజి వస్తువులు, వివిధ ఎయిర్ కండిషనర్ బ్రాండ్లు, ఆటోమొబైల్ భాగాలు, వీల్‌చైర్లు, ఇసుజు వాహనాలతో సహా "మేడ్ ఏ శ్రీ సిటీ" ఉత్పత్తుల ప్రదర్శన ప్రతినిధులను ఆకర్షించింది. దీనిని సందర్శించిన దౌత్యవేత్తలు, మంత్రులు, పరిశ్రమల ప్రతినిధులు శ్రీసిటీ విలక్షణమైన సమగ్ర అభివృద్ధి నమూనాను ప్రశంసించారు.

ప్రభుత్వ పాఠశాలలో సామాజిక తనిఖీల పైలెట్ ప్రాజెక్టు



ప్రజాశక్తి - సత్యవేడు : ప్రభుత్వం చేపడుతున్న పాఠశాలలలో సామాజిక తనిఖీని పైలెట్ ప్రాజెక్టుగా సత్యవేడు మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఈ సామాజిక తనిఖీలో భాగంగా పాఠశాలలోని మౌలిక వసతులు, బోధనాపరమైన విషయాలు, పాఠశాలలోని విద్యార్థుల భద్రత సంబంధమైన విషయాలపై తనిఖీ సభ్యులు ఆరా తీశారు. ఈ సామాజిక తనిఖీ గురువారం నాడు మండలంలోని చెరివి గ్రామంలోని మోడల్ ప్రైమరీ స్కూల్ లోను, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ లోను నిర్వహించారు. ఇది పైలెట్ ప్రాజెక్టు మాత్రమే కావడంతో కేవలం మూడు పాఠశాలలకు పరిమితం చేశారు. ఈ సోషల్ ఆడిట్లో ఎంఈఓ 2 ఉష, సామాజిక తనిఖీ అధికారులు బాలాజీ, ఇంతియాజ్, నాగరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసూన పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి స్థల సేకరణ

ప్రజాశక్తి -కోట : కోట పట్టణంలో ప్రజల సౌకర్యార్థం సులబ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని అందుకోసం స్థల సేకరణ కోసం ఎన్డీసీసీబీ వైస్ చైర్మన్, ఊనుగుంటపాలెం పిఏఎస్ చైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ లు కలిసి శుక్రవారం పరిశీలించారు. అయితే కోట మండల కాంప్లెక్స్ పరిధిలో ఒకటి కోట ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఒకటి నిర్మించినట్లయితే ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఉంటుందని అందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వారు తెలిపారు. ఈ మేరకు పలు చోట్ల ఉండే స్థలాలను ప్రత్యేక్షంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోట తహసీల్దార్ కటారి జయ జయ రావు, ఎంపిడిఓ దిలీప్ కుమార్ నాయక్, ఎంపీటీసీలు శంషుద్దీన్, దారా.సురేష్, మైనార్టీ నాయకులు నౌషద్ భాష, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, రెవిన్యూ సిబ్బంది,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, నెలవాయి గ్రామంలో రైతుల సంక్షేమం కోసం సుళ్లూరుపేట ఫార్మా ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ ముందడుగు వేసింది. జాతీయ ఆహార నూనె గింజల పథకం కింద భాగంగా, తుమ్మల కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో టిసిజిఎస్-1694 వేరుశెనగ విత్తనాలను స్థానిక రైతులకు పంపిణీ చేశారు. రైతులకు అధిక దిగుబడులు సాధించే అవకాశాలు మరింత మెరుగవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాణ్యమైన విత్తనాల అందుబాటుతో సాగు వ్యయాలు తగ్గి, ఆదాయం పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్తామని సుళ్లూరుపేట ఫాట్ ఫార్మ ప్రొడ్యూసర్స్ అధినేత తుమ్మల కన్నయ్య నాయుడు తెలిపారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: గంగమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించిన బీఆర్ నాయుడుకు తిరుపతి, తాతయ్య గుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, ఈఓ జయకుమార్, బోర్డు సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ సహకారం ఎల్లవేళలా ఉంటుందని, భక్తులకు మంచి సదుపాయాలు కల్పిస్తూ, ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని గంగమ్మ ఆలయ బోర్డు సభ్యులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సూచించారు. ఆలయ అర్చకులు ఆశీర్వాదించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

కైలాసధామాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి పట్టణంలో నిర్మిస్తున్న కైలాస ధామంను ఎమ్మెల్యే పులివర్తి నాని పరిశీలించారు. కైలాస ధామంలో ఇమ్మిగ్రేషన్ సంబంధించిన వారితో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. వాస్తు ప్రకారం ఇమ్మిగ్రేషన్ పరికరాలను ఏర్పాటు పై ప్లానింగ్ సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరితగతిన పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే తెలిపారు. కైలాస ధామంకు విరాళాలు సేకరించాలని కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గోవిందధామం అధ్యక్షులు వీరాంగారి రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గౌస్ బాషా, టీడీపీ మండల ప్రెసిడెంట్ బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కొండూరు ప్రవీణ్, సక్కురు ధనంజయ్ రెడ్డి, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీడీసీఎల్‌లో పలువురికి ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఏపీఎస్పీడీసీఎల్ లో పలువురికి పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి నుంచి సూపరింటెండింగ్ ఇంజనీరుగా సోమశేఖర్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా చంద్ర నాయక్, అకౌంట్స్ ఆఫీసర్ నుంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లుగా శ్రీధర్, నరేంద్ర నాయుడులు పదోన్నతి పొందారు. అలాగే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి నుంచి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 25 మందికి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ నుంచి అకౌంట్స్ ఆఫీసరుగా ఏడుగురికి, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ స్థాయి నుంచి అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసరుగా 19 మందికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్ ఫామ్ పై అవగాహన



ప్రజలకు వివరిస్తున్న నారాయణరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు డిజిటల్ గవర్నెన్స్ బలోపేతమే లక్ష్యంగా గ్రామ వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో ఆయా సచివాలయ పరిధిలో నివాసం ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్రయోజనాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన ట్లు గ్రామ వార్డు సచివాల యు జిల్లా అధికారి జివి నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని పుత్తూరు రూరల్ మండలం వేపగుంట సచివాలయం, నారాయణ వనం మండలం సచివాలయాల పరిధిలోని గ్రామాలలో స్థానిక ప్రజల వద్దకు వెళ్లి మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్(9552300009) పై అవగాహన కల్పించామన్నారు. ఈ ప్లాట్ ఫాం ద్వారా ప్రజలు 709 ప్రజా సేవలను ఇంటి వద్ద నుండి సులభంగా పొందవచ్చునని, ప్రభుత్వ కార్యాలయా లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం ఆదా అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని నారాయణరెడ్డి తెలిపారు.

అంగన్వాడీ కేంద్రం తనిఖీ



ప్రజాశక్తి - వాకాడు: కల్లూరు సచివాలయం, అంగన్వాడి కేంద్రాలను ఎంపీడీవో సాయి ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివా లయ రికార్డులను పరిశీలించారు. అనంతరం కల్లూరు అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీడీవోతో పాటు సంబంధిత పంచాయతీ కార్యదర్శి సి.హెచ్ సురేష్ బాబు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి ఉపాధ్యాయురాలు పి.భారతి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాల్యవివాహాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ దేవ కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వై జర్ జ్యోతి, పాఠశాల సిబ్బంది, ఆరోగ్య పర్యవేక్షకురాలు జ్యోతి, ఆరోగ్య కార్యకర్త రత్నమ్మ ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా చాచా నెహ్రూ జయంతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, పరమేశ్వర మంగళం ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని దాత కొరపాటి మధురం ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆర్‌టిడి ట్రస్టు, హెచ్‌జి ఫౌండేషన్ వారు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ శెట్టి, ఆర్‌డిటి అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక తుమ్మలగుంట, నలందనగర్, శ్రీ సాయి సుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ విద్యతోపాటు పిల్లలకు క్రమశిక్షణ ఎంతో ముఖ్య మని తెలిపారు. పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం. వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రగతి, ఎస్ఓఎస్ ఆర్గనైజేషన్ల సౌజన్యంతో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓఎస్ కో వర్కర్ మునిరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బైరాగి పట్టెడలో శుక్రవారం ఘనంగా బాలల దినోత్సవం సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ విస్డం క్లబ్ తిరుపతి అధ్యక్షులు, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ ప్రెసిడెంట్ తహ సున్నీసా బేగం, మహాత్మా గాంధీ మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపా ధ్యాయులు పరంధామయ్యలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి రామానాయుడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పరందమయ్య, ఎంజీఎం హై స్కూల్ ఉపాధ్యాయులు బండి మధుసూదన్ రెడ్డి, సహిత విద్యా ఉపాధ్యాలు భవాని, జ్ఞానమ్మ తదితరులు పాల్గొన్నారు. తిరుపతి, కొర్లగుంట మోడల్ ప్రైమరీ స్కూల్‌లో శుక్రవారం బాలల దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆకేపాటి సుభాషిని (జనసేన రాష్ట్ర కార్యదర్శి, సంఘసేవకురాలు) విచ్చేశారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి 5 వేల రూపాయల విలువైన బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ భాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రేణిగుంట: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, రాస్ వారి సంయుక్త ఆధ్వర్యంలో రేణిగుంట మండలం తారకరామా నగర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంత బాయి, మిషన్ కోఆర్డినేటర్ కృష్ణ మంజరి, డిసిపిఓ శివశంకర్, డిసిపియు సిబ్బంది దేవయాని, రాస్ కోఆర్డినేటర్స్ భారతి, శైలజ, ఐసిడిఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విప్పమాని పట్టెడ గ్రామ పంచాయతీలో శుక్రవారం వేమాపురం సంజీవరెడ్డి కాలనీలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీపతి రెడ్డి, మం డల పరిషత్ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని గృహవిజ్ఞాన శాస్త్ర విభాగమునకు అనుబంధంగా ఉన్న యస్.వి.యు లాబరేటరీ



నుర్సరీ స్కూల్ నందు నవంబర్ 14 వ తేదిన బాలల దినోత్సవము ఘనంగా నిర్వహించారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథి గృహవిజ్ఞాన శాస్త్ర విభాగాధిపతి ప్రొ. కె.వి. సుచరిత మాట్లాడుతూ బాల్య దశలో పిల్లల అభివృద్ధికి తప్పక సమతుల ఆహారం అవసరమని, వారి అలవాట్లు గురించి వివరించారు. కార్యక్రమానికి సినియర్ ఆచార్యులు కె. అనురాధ, డా. బి స్వరూపరాణి మాట్లాడుతూ పిల్లలను మొబైల్ ఫోన్స్ కెదురుగా ఉంచి, పనులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో పిల్లలు వినిధ రకాల వేషదారణలలో ఆ పాటతో అలరించారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్ర విభాగం పరిశోధకులు, విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు సుదర్శనమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరి, శాఖా గ్రంథాలయములో 58 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమములో భాగంగా ఈరోజు చాచా నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వార్డు మెంబరు శ్రీ కోటేశ్వరరావు గారు విచ్చేసి జెండా ఆవిష్కరణ చేశారు. నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్య క్రమంలో రాయల్ విక్టరీ స్కూల్‌జి టీచర్ రోహిణి పిల్లలకు నెహ్రూ గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో శివశంకరరెడ్డి, రిటైర్డ్ టీచర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, పాఠకులు, విద్యార్థులు, గ్రంథాలయాధికారిణి ఎ.రెడ్డెమ్మ, స్వీపర్ రమాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి -కోట : మండల పరిధిలోని అన్నీ ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా



శుక్రవారం బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయ, ఉపాధ్యాయునీలు ముందుగా నెహ్రు చిత్ర పటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలతో నివాళులు అర్పించారు.అదేవిధంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ నెహ్రు యొక్క గొప్ప తనాన్ని కొనియాడారు.పలు పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో అలరించారు.క్విజ్, వ్యాసరచన,తదితర పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేసినట్లు స్థానిక మండల విద్యాశాఖాధికారి దారా.మస్తానయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.